క్లుప్తంగా

మహిళా పోలీసులకు సత్కారం



మహిళా పోలీసులను సత్కరిస్తున్న ఎస్సై గోపాలరావు

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న 8 మంది మహిళా పోలీసులను ఎస్ఐ ఎస్.గోపాలరావు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ మహిళా దినోత్సవం రోజున ఎస్.కోట దగ్గర ఉన్న పుణ్యగిరి జాతరకు బందోబస్తు నిమిత్తం సిబ్బంది వెళ్లడంతో ఆరోజు వారిని సన్మానించుకోలేక పోయామని అన్నారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.2 లక్షలతో వంటగది నిర్మాణం

గజపతినగరం రూరల్: మండలంలోని సాలిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎస్ఎస్ఏ నిధులు రూ.2 లక్షలతో నూతనంగా నిర్మించిన వంటగదిని జెడ్పీటీసీ గార తవుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో ఎన్నో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. మనబడి 'నాడు–నేడు' క్రింద కోట్లాది రూపాయలు ఖర్చుచేసి పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించడం జరిగిందన్నారు. వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గంట్యాడ కళావతి, పార్టీ నాయకులు బెల్లాన త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.

రూ.2.50 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ కొండమ్మ, వైస్ సర్పంచ్ రామునాయుడు

గజపతినగరం: మండల కేంద్రంలో ఆల్తివారివీధిలో మండల పరిషత్ నిధులతో చేపడుతున్న రోడ్లు, కాలువల నిర్మాణ పనులను సర్పంచ్ నరవ కొండమ్మ, వైస్ సర్పంచ్ కర్రి రామునాయుడు శుక్రవారం ప్రారంభించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో స్థానికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి మండల పరిషత్ నుంచి రూ.2.50 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో సీసీరోడ్డు, కాలువలు నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తుమికాపల్లి సర్పంచ్ బెల్లాన త్రినాథరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి నానాజీ, ఆల్తి రామనాయుడు, బోడసింగి వాసు, తదితరులు పాల్గొన్నారు.


'ఈ–పంట'తో బహుళ ప్రయోజనాలు

గజపతినగరం రూరల్: రైతులు తాము సాగుచేస్తున్న పంటలను ఈ–పంటలో నమోదు చేయడం ద్వారా బహుళ ప్రయోజనాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వి.టి.రామారావు అన్నారు. మండలంలోని కాళంరాజుపేట గ్రామంలోని సచివాలయంలో ఈ–పంటకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను శుక్రవారం రైతులకు అందజేశారు. అనంతరం పంట నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఏడీఏ మహారాజన్, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి వితరణ

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని అర్తమూరు గ్రామంలో పదో తరగతి విద్యార్థులకు విజయగౌరీ యువజన సేవాసంఘం ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని శుక్రవారం అందజేశారు. పరీక్షలు బాగా రాయాలని, మంచి మార్కులు తెచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షుడు పిల్ల సుధాకర్, విశ్రాంత ఉపాధ్యాయుడు గంగుపల్లి సత్యనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎంఈఓ దంపతులకు సన్మానం



ఎంఈఓ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గజపతినగరం: ఉత్తమ ఎంఈఓగా జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చేతులు మీదుగా అవార్డు అందుకున్న విమలమ్మను, ఆమె భర్త, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావును మండల ఉపాధ్యాయుల బృందం శుక్రవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. జిల్లా ఉత్తమ మహిళా ఎంఈఓగా ఆమె అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. ఎంఈఓ–2 సాయిచక్రధర్, మరుపల్లి ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గెద్ద ఈశ్వరరావు, స్థానిక బాలుర, బాలికోన్నత పాఠశాల హెచ్ఎంలు బి.వెంకటేశ్వరరావు, చిప్పాడ రమేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మంచి జరిగితేనే ఆశీర్వదించండి

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన



గుర్ల: ఆర్బీకేను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

గుర్ల: ప్రజలకు మంచి జరిగితే సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ప్రజలను కోరారు. మండలంలోని కొండగండ్రేడులో సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. గ్రామాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలన ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన అన్ని సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. గతంలో ప్రభుత్వ సేవల కోసం మండల కేంద్రం చుట్టూ తిరగేవారని గుర్తు చేశారు. అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రతీ పేదవాడిని ఆర్థికంగా ఆదుకున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తేనే అన్ని పథకాలు ఆమలవుతాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాసినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు, జేసీఎస్ కన్వీనర్లు బెల్లాన బంగారునాయుడు, కెంగువ మధుసూదనరావు, సర్పంచ్ సారిక గోవింద్, ఎంపీటీసీ మణ్యపురి రామారావు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు

చీపురుపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ అన్నారు. మండలంలోని మెట్టపల్లి గ్రామంలో రూ.24 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, కరకాం గ్రామంలో రూ.21 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ కేంద్రాన్ని జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీషతో కలిసి శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామ స్థాయిలోనే ప్రజలకు కావాల్సిన అన్ని ప్రభుత్వ సేవలను అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహణరెడ్డికే దక్కుతుందన్నారు. ఆర్బీకేల ద్వారా రైతులకు రాయితీపై నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అందించడంతో పాటు పండిన పంటలను మద్దతు ధర చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెవర ఉమా, ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్ధనరావు, చందక గురునాయుడు, మీసాల ఈశ్వరరావు, జమ్ము సావిత్రి, గంగుబిల్లి సూరీడమ్మ, జమ్ము సునీల్, తాడు, మీసాల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



చీపురుపల్లి: మెట్టపల్లిలో ఆర్బీకేను ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకటనర్సమ్మ

'పది' పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు

మెరకముడిదాం: మండలంలో నాలుగు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు ఈ ఏడాది మొత్తం 751 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. గర్భాం జెడ్పీహెచ్‌ఎస్‌లో 185 మంది, గర్భాం ఏపీ మోడల్ స్కూల్‌లో 240 మంది, మెరకముడిదాం జెడ్పీహెచ్ఎస్–ఎ కేంద్రంలో 140 మంది, బి కేంద్రంలో 186 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు విద్యాశాఖ అధికారులు చంద్రశేఖర్, ప్రసాదరావు తెలిపారు. ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకు పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులు ఉదయం 8:30 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని అధికారులు సూచించారు.

చెరువు ఆక్రమణకు అడ్డుకట్ట



అక్రమ తవ్వకాలను అడ్డుకుంటున్న స్థానిక సర్పంచు రామయ్యమ్మ

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలం శేరీపేట రెవెన్యూ పరిధిలో విజయనగరం–పాలకొండ ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న కుమ్మరి చెరువు ఆక్రమణకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, పంచాయతీ సర్పంచ్ పిల్లా రామయ్యమ్మ శుక్రవారం అడ్డుకట్ట వేశారు. పంచాయతీ నుంచి కానీ, ప్రభుత్వం నుంచి కానీ ఎలాంటి అనుమతులు లేకుండా జేసీబీతో చెరువు గర్భాన్ని తవ్వేసి చెరువుగట్టును రోడ్డుగా మార్చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ పిల్లా రామయ్యమ్మ, సెక్రటరీ అప్పలనాయుడుతో కలిసి ఆక్రమణ తవ్వకాలను అడ్డుకున్నారు. దీనిపై మండల తహసీల్దార్, ఎంపీడీఓలకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అయితే ఉన్నతాధికారుల అండదండలు లేకుండా ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ఈ చెరువులో అక్రమ తవ్వకాలు జరిగే అవకాశం లేదని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజులుగా తవ్వకాలు జరుగుతున్నా అధికారుల నుంచి ఎలాంటి చర్యలు లేకపోవటంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎన్నికల విధుల్లో అలసత్వం వహించొద్దు

- రిటర్నింగ్ అధికారి సూర్యకళ



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్వో సూర్యకళ

గజపతినగరం రూరల్: ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది ఎలాంటి అలసత్వం వహించరాదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూర్యకళ అన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఎంసీసీ, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీలకు మండల కేంద్రంలో శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 17 నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తిస్థాయిలో ప్రారంభం కానుందన్నారు. ప్రతీ మండలంలోనూ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఫొటో, వీడియో గ్రాఫర్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సమించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, గంట్యాడ మండల తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



బాధిత కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందచేస్తున్న ఎమ్మెల్యే కడుబండి

వేపాడ: మండలంలో పలు గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శుక్రవారం అందజేవారు. కొత్తవలసలో నిర్వహించిన కార్యక్రమంలో సోంపురానికి చెందిన పెదగాడి లక్ష్మికి రూ.2 లక్షలు, చింతల దేముడమ్మకు రూ.35 వేలు చెక్కును అందజేసినట్లు సోంపురం ఎంపీటీసీ సత్యనారాయణ తెలిపారు. అలాగే వావిలపాడు చెందిన భూమిరెడ్డి శంకర్ ప్రమాదంలో చనిపోవటంతో వారి కుటుంబ సభ్యులకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.2 లక్షలు చెక్కు అందచేసినట్లు సర్పంచ్ బీల రాజేశ్వరి, సతీష్ దంపతులు తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

దత్తిరాజేరు: ఉపాధిహామీ పథకం వేతనదారులతో నిబంధనల ప్రకారం పనులు చేయించడంతో పాటు పనికి తగిన వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ చంద్రకుమారి అన్నారు. టి.భూర్జవలసలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శుక్రవారం ఏపీఓ వెంకటప్పలనాయుడుతో కలిసి పరిశీలించారు. వేసవి ఎండలు ఎక్కువగా ఉన్నందున పని ప్రదేశం వద్ద టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని క్షేత్ర సహాయకులు వెంకటలక్ష్మిని ఆదేశించారు.

సంక్షిప్తంగా..

పేకాటరాయళ్లు అరెస్ట్

గజపతినగరం: మండలంలోని బంగారమ్మపేట సమీపంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు శుక్రవారం రాత్రి దాడిచేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.59,600లు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు.

45 మద్యం సీసాలు సీజ్

గజపతినగరం: మండలంలోని పిడిశీల గ్రామానికి చెందిన ఇంకుల నారాయణమూర్తి మద్యం సీసాలు తరలిస్తుండగా ఎం.వెంకటాపురం జంక్షన్ వద్ద శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై యు.మహేష్‌కుమార్ తెలిపారు. అతని వద్ద 45 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మద్యం, జూదం, కోడి పందేలు, పలు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు మెగా లోక్‌అదాలత్

గజపతినగరం: స్థానిక ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ కోర్టులో శనివారం నిర్వహించే మెగా లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని జడ్జ్ బి.కనకలక్ష్మి కోరారు. కోర్టులో న్యాయవాదులు, పోలీసులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, తదితర కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకునేందుకు వీలుంటుందన్నారు. కక్షిదారులకు దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గంట్యాడ: మండలంలోని కొండతామరపల్లి ఎస్సీ కాలనీ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే బొండపల్లి మండలం కొండపేటకు చెందిన జి.వెంకటరమణ, జి.పవన్‌కుమార్ బైక్‌పై గంట్యాడ వైపు వస్తుండగా కొండతామరపల్లి ఎస్సీ కాలనీ వద్దకు వచ్చేసరికి తామరపల్లి నుంచి ఎం.కొత్తవలస వైపు బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులు వెంకటరమణ, పవన్‌కుమార్‌లను స్థానికులు 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు.

నేడు రహదారి నిర్మాణానికి భూమిపూజ

దత్తిరాజేరు: స్థానిక ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆదేశాల మేరకు మండలంలోని గదబవలస నుంచి చిన్న చేమలాపల్లి మీదుగా ఇంగిలాపల్లి వరకు పంచాయతీరాజ్, రూరల్ డవలప్‌మెంట్ నిధులు రూ.2కోట్ల 20లక్షలతో రోడ్డు నిర్మాణానికి శనివారం ఉదయం భూమిపూజ నిర్వహించనున్నట్లు ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు తెలిపారు. పి.లింగాలవలస నుంచి బాడంగి మండలం వీరసాగరం వరకు పంచాయతీరాజ్, రూరల్ డవలప్‌మెంట్ నిధులు కోటి రూపాయలతో బీటీ రోడ్డు నిర్మానానికి జెడ్పీటీసీ రైతు రాజేశ్వరితో కలిసి భూమిపూజ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అన్ని గ్రామాల నుంచి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

17 నుంచి ఎల్లారమ్మ జాతర

జామి: మండలంలోని భీమసింగి గ్రామంలో ఈనెల 17 నుంచి ఎల్లారమ్మ తీర్థమహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 17న తోలేళ్ల ఉత్సవం, అమ్మవారి పుట్ట పూజ కార్యక్రమాలతో పాటు వివిధ సృంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 18న అమ్మవారి తీర్థమహోత్సవం, అదే రోజు ఎడ్లపందాలు పోటీలు జరగనున్నట్లు తెలిపారు. ఎడ్ల పందాలలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు అందించనున్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు ఆలయ కమిటీని 9177746748లో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు స్కౌట్ దుస్తుల వితరణ

లక్కవరపుకోట: మండలంలోని చందులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటైన సుభాష్ చంద్రబోష్ స్కౌట్ యూనిట్‌లో చేరిన 32 మంది విద్యార్థులకు ప్రత్యేక యూనిఫాంను స్థానిక సాహం ట్రస్టు వ్యవస్థపకులు ఎం.గణేష్ శుక్రవారం అందజేశారు. పాఠశాల హెచ్ఎం బి.గోవిందరావుకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓలు సీహెచ్.కూర్మారావు, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్బీకే సిబ్బంది అందుబాటులో ఉండాలి

మెరకముడిదాం: మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు అందుబాటులో ఉండాలని మండల వ్యవసాయశాఖాధికారి శ్రావణితేజ సూచించారు. మండలంలో కొందరు వీఏఏలు రైతులకు అందుబాటులో ఉండటం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని, మరోసారి ఇలాంటి ఫిర్యాదులు అందితే ఉపేక్షించేది లేదని, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి ఆ ఫొటోలను ఎప్పటికప్పుడు తనకు వాట్సాప్‌లో పంపించాలన్నారు.

పరీక్ష కేంద్రంలో వసతుల పరిశీలన

వేపాడ: మండలంలో కొండగంగుబూడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని ఎంఈఓ బాలభాస్కరరావు శుక్రవారం సందర్శించారు. కేంద్రంలో విద్యుత్, ఫర్నీచర్, తాగునీరు, మరుగుదొడ్లు, తదితర సౌకర్యాలను పరిశీలించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

గ్రామాల్లోనే మెరుగైన వైద్య సేవలు

జామి: మండలంలో కుమరాం గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అలమండ పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్.పద్మావతి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సుమారు 354 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పిన్నింటి ఆదిలక్ష్మి, కంది పద్మావతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

- దత్తిరాజేరు: మండలంలోని టి.భూర్జవలసలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష–2 శిబిరంలో 96 మందికి వైద్య సేవలందించినట్లు దత్తిరాజేరు వైద్యాధికారి ఆనంద్‌కుమార్ తెలిపారు. బీపీ, షుగర్, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మంత్రి క్రాంతికుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



బాధితులకు చెక్కులు అందజేస్తున్న జడ్పీ చైర్మన్, ఎంపీ

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలానికి చెందిన పలువురికి జిల్లా పరిషత్ నిధుల నుంచి ఆర్థిక సాయం అందజేశారు. గరివిడి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ శుక్రవారం చెక్కులు పంపిణీ చేశారు. శేరీపేట గ్రామానికి చెందిన తెలుగు తవుడు భీమిలి సిద్ధం సభ నుంచి తిరుగు ప్రయాణం అవుతున్న సమయంలో రోడ్డు ప్రమాదానికి గురై మరణించగా.. ఆయన భార్య తొడమ్మకు రూ.50 వేలు చెక్కు అందించారు. ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన వెదుళ్లవలస గ్రామానికి చెందిన పాండ్రంకి విజయ, గొట్లంది గ్రామానికి చెందిన రత్నం కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.25 వేలు చొప్పున అందజేశారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న శివరాం గ్రామానికి చెందిన పాదిలాపు సోముకు రూ.25 వేలు సాయం చేశారు. అలాగే కుమారాం గ్రామంలో వీధికుక్కల దాడిలో తొంగి తాతకు చెందిన 25 గొర్రెలు మరణించడంతో ఆయనకు రూ.25 వేలు, పాసి మునలయ్యకు చెందిన 16 గొర్రెలు మరణించడంతో ఆయనకు రూ.15 వేలు చొప్పున ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, ఆయా గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం



ఇంటింటికి వెళ్లి సంక్షేమ లబ్ధి పత్రాలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బొండపల్లి: ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందిచడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన అందించారని అంబటివలస సర్పంచ్ సిరిపురం కసవయ్య, ఎంపీటీసీ సభ్యుడు తాళ్లపూడి అప్పలనాయుడు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మండలంలోని అంబటివలస గ్రామంలో శుక్రవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి చేకూరిన లబ్ధిని తెలియజేసే కరపత్రాలను పంపిణీ చేశారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రౌతు సూరిబాబు, రౌతు చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో అందుతున్న వైద్యసేవలను పరిశీలిస్తున్న జడ్జి విజయచంద్ర

కొత్తవలస: స్థానిక కోర్టు ఆవరణలో బార్‌అసోసియేషన్, రామదండు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విశాఖపట్నం మెడికవర్ ఆస్పత్రి వారి సహకారంతో శుక్రవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. న్యాయమూర్తి ఎస్.విజయచంద్ర వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులు, కక్షిదారులు, స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. అనంతరం శిబిరంలో సేవలందించిన వైద్యలను సన్మానించారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు మహేష్, నందిపల్లి శ్రీరామ్మూర్తి, కార్యదర్శి ఎంవీఎస్ గిరిబాబు, న్యాయవాదులు జి.మహేంద్ర, శ్రీనివాసరావు, జి.లత, పీవీ దేవి, డి.ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం



సంప్రదాయ థింసా నృత్యం చేస్తున్న విద్యార్థినులు

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల 40వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎఫ్ఓ ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు సివిల్స్, ఫారెస్ట్ సర్వీసెస్‌లోకి రావాలని పిలుపునిచ్చారు. వనం లేనిదే మానవ మనుగడ లేదని, వన సంరక్షణ బాధ్యత మనందరిపైన ఉందన్నారు. ప్రిన్సిపాల్ సి.హెచ్.కేశవరావు మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా ఎంతో మందిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన ఈ కళాశాల భవిష్యత్ తరాలకు కూడా సేవలందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. కళాశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు



బొండపల్లి: గిట్టుపల్లిలో తాగునీటి బోరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: మండల పరిషత్ నిధులతో అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన తాగునీటి బోర్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎస్.హరిహరరావు అన్నారు. మండలంలోని గిట్టుపల్లి గ్రామంలో ఇటీవల ఏర్పాటు చేసిన తాగునీటి బోరును శుక్రవారం ఆయన పరిశీలించారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

- వేపాడ: మండలంలో నీలకంఠ రాజపురం పంచాయతీలో పాడైన రెండు బోరుబావులను శుక్రవారం బాగుచేసి నీటి సరఫరాను పునరుద్ధరించినట్లు ఉపసర్పంచ్ కండిపల్లి పెదనాయుడు తెలిపారు. పంచాయతీలో మర్రిచెట్టు కళ్లాలు వద్ద, కరణంగారి వీధిలో ఉన్న బోర్లను బాగుచేసినట్లు చెప్పారు.

బార్ అసోసియేషన్‌లో ఎన్నికల సందడి



నామినేషన్లు దాఖలు చేస్తున్న న్యాయవాదులు

శృంగవరపుకోట: స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో బార్ అసోసియేషన్ ఎన్నికల సందడి మొదలైంది. బార్ అధ్యక్ష, కార్యదర్శి పదవులకు న్యాయవాదులు పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. సీనియర్ న్యాయవాదులు మండా కామేశ్వరరావు, జి.సూరిదేముడు, కార్యదర్శి పదవికి డబ్ల్యూ.ఎన్.శర్మ, బి.వి.ఎస్.రామారావు, బి.సత్యనారాయణ, బి.రామకృష్ణ, ఉపాధ్యక్ష స్థానానికి ఎం.అప్పారావు, సంయుక్త కార్యదర్శి స్థానానికి ఎల్.అప్పారావు, కోశాధికారి స్థానం కోసం బి.త్రిమూర్తులు శుక్రవారం నామినేషన్లు దాఖలు చేశారు. 18న నామినేషన్ల పరిశీలన, 20 విత్‌డ్రా, 21న పోటీలో ఉన్న అభ్యర్థుల తుదిజాబితా విడుదల చేయనున్నారు. ఈ నెల 28న పోలింగ్, అనంతరం సాయంత్రం 4గంటలకు కౌంటింగ్ చేపట్టి ఫలితాలను వెల్లడించనున్నారు.

గడపగడపకూ సంక్షేమం

చీపురుపల్లి: రాష్ట్రంలోని ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం అన్నారు. మండలంలోని పీకే పాలవలస పంచాయతీ పరిధి బైరెడ్డిపేట గ్రామంలో శుక్రవారం 'గపడగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేసే బుక్‌లెట్లు అందజేశారు. అందులో ఉన్న పథకాలన్నీ అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా.. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. మళ్లీ జగన్ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. చంద్రబాబు మాయమాటలు నమ్మొద్దని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దనరావు, ఎంపీటీసీ లక్ష్మణ పాల్గొన్నారు.